

ఆహారం కలుషితం కావొద్దు
ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸



రూ.కోట్ల విలువైన భూమి కబ్జా
జిల్లా కేంద్రంలోని అసద్‌బాబానగర్ ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన ఫారెస్ట్, ప్రైవేట్ భూమి కబ్జాకు గురైంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /17.2

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి శుక్రవారం ఢిల్లీలోని కార్యాలయంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. దేశంలో పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానని గంగారెడ్డి పేర్కొన్నారు. అనంతరం పల్లె గంగారెడ్డిని ఎంపీ సహా కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

15,937 మందికి అందిన రైతు భరోసా

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు జిల్లాలో 15,937 మంది రైతులకు రైతు భరోసా నిధులను అందించింది. రైతుల ఖాతాల్లో మొత్తం రూ.18,52,43,385 జమ అయినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. పథకం ప్రారంభోత్సవం సందర్భంగా జనవరి 26న మండలానికి ఒక గ్రామ పంచాయతీని ఎంపిక చేసి రైతులకు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఏడాదిలో ఎకరానికి రూ.12వేలు ఇవ్వనుండగా, మొదటి విడతలో ఎకరానికి రూ.6వేల చొప్పున నిధులు రైతుల ఖాతాల్లో పడ్డాయి.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



నవీపేట: నవీపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షాఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో అశోక్, ఎంఆర్‌సీ రాకేశ్ తదితరులున్నారు.

పోలీస్ క్రీడల్లో సిల్వర్ మెడల్



ఖలీల్‌వాడి: కరీంనగర్‌లో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో జిల్లాకు చెందిన కానిస్టేబుల్ రేఖారాణి సిల్వర్ మెడల్ సాధించింది. శుక్రవారం నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ 73 కిలోల విభాగంలో తలపడిన ఆమె 160 కిలోల బరువుఎత్తి తృతీయ స్థానంలో నిలిచింది. రేఖారాణి నగరంలోని నాలుగోటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించగా, ఆమెను షీ టీమ్‌కు అటాచ్ చేశారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా జయకుమార్



నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా జయకుమార్ నియమితులయ్యారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా సుదీర్ఘకాలం జయకుమార్ నిజామాబాద్ మున్సిపాలిటీలో పనిచేశారు. పదోన్నతిపై బోధన్ మున్సిపాలిటీకి వెళ్లారు. తిరిగి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎంహెచ్‌వో బాధ్యతలు ఆయనకు అప్పగించనున్నారు. టీపీవో సత్యనారాయణ, బిల్ కలెక్టర్ ఆనంద్‌లు పదవీ విరమణ పొందారు. వీరికి మున్సిపల్ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. అడిషనల్ కమిషనర్ ఎస్ శంకర్ బదిలీపై జీహెచ్ఎంసీకి వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరూ చార్జ్ తీసుకోలేదు.

నిర్మలమ్మ పద్దుపై ఆశలు





పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లాకు నిధుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ సర్వేకు యూపీఏ ప్రభుత్వం అప్పటి బడ్జెట్‌లో నిధులు ప్రకటించినా ముందుకు పడలేదు. నిజామాబాద్–ఆర్మూర్–కరీంగనర్–కాగజ్‌నగర్ లైన్‌లో రైళ్లు పెంచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పాలసీ ప్రకటించాలంటున్నారు. వీటితో పాటు జిల్లాలో మరికొన్ని ఇతర డిమాండ్లు నెలకొన్నాయి.

- ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్‌కు రైల్వే లైన్ ఏర్పాటుకు ఏళ్లుగా డిమాండ్
- గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పాలసీ కోరుతున్న కార్మిక కుటుంబాలు
- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు లబ్ధి చేకూర్చే నిర్ణయాలు, నిధుల కేటాయింపుపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. జిల్లాలోని ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు పై అనేక ఏళ్ల నుంచి డిమాండ్లు ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఈ లైన్ సర్వేకు సంబంధించి నిధులు ఇస్తామని అప్పటి బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే ఇప్పటివరకు ముందుకు పడలేదు. కాగా ఈ లైన్‌ను ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్–డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు గతంలో ప్రతిపాదన ఉంది. ఈ విషయంలో ప్రస్తుత బడ్జెట్‌పై ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసుల్లో ఆశలు పెరిగాయి. ఇక ఆర్మూర్ రైల్వేస్టేషన్‌కు ఇప్పటివరకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈసారైనా దీనికి పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. నిజామాబాద్–ఆర్మూర్–కరీంగనర్–కాగజ్‌నగర్ లైన్‌లోనూ రైళ్లు పెంచాలంటున్నారు.

■ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆశలు ఉన్నాయి. గతంలో జిల్లాలోని జానకంపేట వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.700 కోట్లతో ఇథనాల్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కేంద్రం నిర్ణయించగా, కేసీఆర్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడంతో సదరు ఇథనాల్ ఫ్యాక్టరీ హర్యానాకు తరలివెళ్లింది. ఇక్కడే నెలకొల్పే విషయమై ఐటీసీ ఈడీ రెండుసార్లు జిల్లాకు వచ్చి వెళ్లారు. అయినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహంలో భాగంగా చెరుకు నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రెండు రోజుల క్రితం కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్‌సీఎంఎం) పాలసీని ఏర్పాటు చేశారు. ఈ ఎన్‌సీఎంఎం కోసం రూ.16,300 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించారు. ఈ పాలసీ ఆరేళ్ల పాటు కొనసాగనుంది. ఈ పాలసీ నేపథ్యంలో అన్నిరకాల అవకాశాలు ఉన్న నిజామాబాద్ జిల్లాలో చెరుకు రైతులను ప్రోత్సహించడంతో పాటు ఇథనాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసే విషయమై ఆశలు నెలకొన్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిజాం షుగర్స్‌ను ప్రారంభించే ప్రయత్నాలకు కేంద్రం దన్నుగా నిలవాలనే డిమాండ్లు ఉన్నాయి. అదేవిధంగా సారంగాపూర్‌లోని ఎన్‌సీఎస్ఎఫ్ చక్కెర యూనిట్‌ను ప్రారంభించాలని డిమాండ్లు ఉన్నాయి. వీటితో ఉమ్మడి జిల్లాలో ఎకానమీ పెరుగుతుందని వివిధ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

■ ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని 32 శాసనసభ నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో ఉన్న గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి సంబంధించి ప్రత్యేక పాలసీ కోసం చాలాకాలంగా డిమాండ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ పాలసీ విషయమై ఆయా కార్మికుల కుటుంబాలు లక్షలాది కళ్లతో ఎదురు చూస్తున్నాయి.

వస్తు తయారీ కోసం..

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని డిచ్‌పల్లి వద్ద భారీ వస్తు తయారీ పరిశ్రమను నెలకొల్పాలని డిమాండ్లు ఉన్నాయి. అదే విధంగా డ్రైపోర్ట్, కంటెయినర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాజిస్టిక్ ఫ్రైట్ డిపో ఏర్పాటు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపులు చేస్తేనే ఇవి సాధ్యం.

సుముహూర్తాల సందడి

- మాఘ మాసం.. మంచి రోజులు
- మోగనున్న పెళ్లి బాజాలు
- పెరిగిన బంగారం ధరలు



నిజామాబాద్ రూరల్: మాఘమాసం సుముహూర్తాలను మోసుకొచ్చింది. జనవరి 31 మొదలుకుని మే చివరి వారం వరకు మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఎటు చూసి నా శుభకార్యాల సందడి కనిపించనుంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. ఇప్పటికే కళ్యాణ మండపాలు, ఫొటో, వీడియో షూటింగ్, క్యాటరింగ్, బ్యాండ్ బుకింగ్ పూర్తయ్యింది. పురోహితులకు డిమాండ్ పెరగనుంది. వస్త్ర, నగల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడడం ప్రారంభమైంది. మరోవైపు బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.84వేలకు పైగా పలుకుతోంది. వివాహాల సీజన్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.లక్ష దాటొచ్చని నగలవ్యాపారులు అంటున్నారు.

సుముహూర్తాలు..

ఫిబ్రవరి : 2, 7, 13, 14, 16, 20, 22, 23,
మార్చి : 2, 7, 13, 14, 15, 16,
ఏప్రిల్: 9, 10, 11, 12, 13, 16, 18, 20, 23, 29, 30,
మే: 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 23, 28

కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి ఖరారు

- అధికారికంగా ప్రకటించిన పార్టీ నాయకత్వం
- ముందే చెప్పిన 'సాక్షి'



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంగనర్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిని ఖరారు చేసింది. శుక్రవారం పార్టీ నాయకత్వం అధికారికంగా ప్రకటించింది. నరేందర్‌రెడ్డి గత రెండున్నర నెలల నుంచే నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తృత ప్రచారం చేస్తూనే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ టికెట్ కోసం పలువురు పోటీ పడినప్పటికీ నరేందర్‌రెడ్డి దక్కించుకోవడం గమనార్హం. నరేందర్‌రెడ్డి పేరును పార్టీ నాయకత్వం ఖరారు చేసినట్లు 'సాక్షి'లో శుక్రవారం వార్త ప్రచురితమైంది. కాగా బీజేపీ ఇప్పటికే తన అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన సీ అంజిరెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రెండు జాతీయ పార్టీల అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ జరుగనున్నట్లు వివిధ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

స్వీయనియంత్రణతో రోడ్డు ప్రమాదాల నివారణ

- నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే దుర్ఘటనలు జరుగుతున్నాయ్
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ శాఖ సౌజన్యంతో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అతివేగంగా, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. కుటుంబ సభ్యులందరూ విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడారు.

జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నెల రోజుల పాటు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రోడ్డు ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులు, ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సదస్సులో ఎంవీఐ కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా ఈనెల 10వ తేదీన 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ, శిక్షణను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు మాత్రలు అందించాలన్నారు. అల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను, రక్తహీనతను నిర్మూలించవచ్చని, పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చన్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో 10వ తేదీన మాత్రలు వేసుకోని పిల్లలు 17వ తేదీన తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేశ్, రాజు, అంజన్న, పీవో డాక్టర్ వినీత్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ సచిన్, జిల్లా ఆరోగ్యవిద్య శిక్షకులు వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ వెంకటేశం, దీపిక తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

అంగన్‌వాడీల్లో నాసిరకం గుడ్లు

- ఇబ్బందుల్లో బాలింతలు, గర్భిణులు
- కేంద్రాలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు



అంగన్‌వాడీ కేంద్రం వారు ఇచ్చిన నాసిరకం గుడ్డు

ఆర్మూర్‌టౌన్: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషక లోపాలు అధిగమించేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందజేస్తోంది. కాని వీరికి అందించే గుడ్లు నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు వాటిని తినలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పౌష్టికాహార లక్ష్యం నీరుగారుతోంది. ఆర్మూర్ పట్టణంలోని ఐసీడీఎస్ పరిధిలో 51 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఏడు నెలలలోపు ఉన్న చిన్నారులు 625 మంది, ఏడు నుంచి ఏడాది వరకు 658 మంది, ఏడాది నుంచి మూడేళ్ల వరకు 2391 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు 1983 మంది, గర్భిణులు 546 మంది, బాలింతలు 629 మంది ఉన్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంది. అయితే నాసిరకం గుడ్లు, ఆహారం అందుతోంది. దీంతో లక్ష్యం నీరు గారిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అంగన్‌వాడీ కేంద్రాలు ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. ఉదయం 9 గంటలకు తెరుచుకోవాల్సిన కేంద్రాలు పదిన్నర అవుతున్నా తెరవడం లేదు. ఆర్మూర్ పట్టణంలోని మూడు సెక్టార్లలో సూపర్‌వైజర్ల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చిన్నారులు పూర్వప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలు ఇంటింటికి తిరిగి చిన్నారులను తీసుకురావాల్సి ఉన్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఇటీవల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా అయ్యాయి. వీటిని పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు పట్టించుకోవడం లేదు.

దీంతో వాటిని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తినలేకపోతున్నారు. పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం వారు ఇచ్చిన గుడ్డును ఓ మహిళ ఇంటికి తీసుకెళ్లి తినేందుకు చూడగా అది నాసిరకంగా వచ్చింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యవేక్షణ చేస్తున్నాం

పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు నాసిరకంగా గుడ్లు వస్తే మా దృష్టికి తేవాలి. కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం.

– భార్గవి, సీడీపీవో ఆర్మూర్

విద్యుత్ అంతరాయానికి చెక్..!

- 777 ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించిన అధికారులు
- నాలుగు సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు..
- ఫీడర్లలో ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు
- పర్యవేక్షణకు నోడల్ అధికారి నియామకం
- వేసవి దృష్ట్యా ఎన్‌పీడీసీఎల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం



సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు (ఫైల్)

సుభాష్‌నగర్: వేసవిలో రానున్న విద్యుత్ కష్టాలకు ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక దృష్టి సారించింది. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ అధికారులు జిల్లాకు నోడల్ అధికారిని నియమించారు. ఆయన పర్యవేక్షణలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇటీవల నోడల్ అధికారి జిల్లాకు విచ్చేసి డీఈలు, ఏడీఈలతో కలిసి సమీక్షించారు. ముఖ్యంగా ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా గృహావసరాలకు కూడా వినియోగం పెరగనుంది. విద్యుత్ అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఎన్‌పీడీసీఎల్ జిల్లా సర్కిల్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో 1.85 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, 4.88 లక్షలు గృహ విద్యుత్ కనెక్షన్లు, మరో 6 వేల పరిశ్రమలకు కనెక్షన్లు ఉన్నాయి. 2.80 లక్షలకు గృహజ్యోతి పథకం వర్తిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 216 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇటీవల న్యాల్‌కల్, తిర్మన్‌పల్లి, తాటిపల్లి, ఎత్తొండ, ధనంబండ తండా, నిజామాబాద్, రహత్‌నగర్‌కు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి.

ఫిబ్రవరి, మార్చిలో అధిక వినియోగం..

ప్రతియేటా ఫిబ్రవరి, మార్చి నెలలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో 24 గంటల పాటు బోరు మోటార్లు నడిపిస్తారు. దీంతో రెండు నెలల పాటు వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. గతేడాది ఫిబ్రవరిలో 325.7 మిలియన్ యూనిట్లు, మార్చిలో 333.8 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2023–24 లో 2851 మిలియన్ యూనిట్లు, 2024–25 (జనవరి వరకు) 2200 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈయేడాది విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

బంచ్‌డ్ వీసీబీల నిర్మాణం..

ఏ ఫీడర్ పరిధిలో విద్యుత్ సమస్య నెలకొంటే అదే ఫీడర్‌లో సరఫరా నిలిచిపోయేలా బంచ్‌డ్ వీసీబీల నిర్మాణానికి ఎన్‌పీడీసీఎల్ శ్రీకారం చుట్టింది. 154 బంచ్‌డ్ వీసీబీల నిర్మాణం అవసరమని గుర్తించగా, 93 బంచ్‌డ్ ఫీడర్లను నిర్మించారు. మిగతా వాటిని కూడా నిర్మిస్తే దాదాపుగా అన్ని ఫీడర్స్ సెపరేట్ అవుతాయి. అలాగే విద్యుత్ వినియోగదారులకు ఆటంకం కలగకుండా ఫీడర్ల మధ్య ఇంటర్ లింకింగ్ లైన్లు వేస్తున్నారు. ఒక ఫీడర్ బ్రేక్ డౌన్ అయినా.. మరో ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

198 ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు

జిల్లా వ్యాప్తంగా 47 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వేసవి కాలంలో విద్యుత్ వినియోగం అధికం కానున్న నేపథ్యంలో ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించారు. 777 ట్రాన్స్‌ఫార్మర్లకు ఓవర్ లోడ్ సమస్య ఉన్నట్లు గుర్తించగా, ఇప్పటికే 198 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. మిగతా వాటిని కూడా త్వరలోనే బిగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నాలుగు చోట్ల సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచారు. కూనీపూర్, పడకల్, చౌట్‌పల్లి, గౌరారంలో సబ్‌స్టేషన్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు.

నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందిస్తాం..



వేసవిలో వ్యవసాయ రంగానికి, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. ఆమేరకు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి నివేదికలు తెప్పించాం. ఎక్కడ కూడా వినియోగదారులకు ఆటంకం కలగకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– రావుల్లి రవీందర్, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్

క్లుప్తంగా

అణగారిన వర్గాల ఆశాజ్యోతి గద్దర్‌



నిజామాబాద్‌నాగారం: గద్దర్‌ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని గద్దర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు గైని గంగారాం అన్నారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్‌ భవన్‌లో శుక్రవారం గద్దర్‌ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ రచించిన రాజ్యాంగ పరిరక్షణ కోసం గద్దర్‌ ఎంతో కృషి చేశారని, ఆర్‌ఎస్‌ఎస్‌, బీజేపీ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. సమ సమాజ స్థాపన, ప్రజలందరికీ తోడ్పాటు అందించేందుకు గద్దర్‌ ఫౌండేషన్‌ ను ఏర్పాటు చేసినట్లు బీసీ ఉద్యోగుల నాయకుడు కరిపె రవీందర్‌ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రమేశ్‌బాబు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌ కుమార్‌, షేక్‌ హుస్సేన్‌, బంగారు సాయిలు, రామ్మోహన్‌రావు, నీరడి లక్ష్మణ్‌, జేఏసీ భాస్కర్‌, మాల మహానాడు ఉపాధ్యక్షుడు సక్కి ప్రభంజన్‌, మహిళా అధ్యక్షురాలు విజయ, జహీరుద్దీన్‌, మల్లారం యువత, కళాకారులు ఆష్ట గంగాధర్‌, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లికి చెందిన గర్భిణి సురేఖ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం అర్ధరాత్రి సురేఖకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108కు డయల్‌ చేశారు. అంబులెన్స్‌ సిబ్బంది గ్రామానికి చేరుకుని సురేఖను జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ సుంకరి విజయ్‌కుమార్‌, పైలట్‌ శ్రీనివాస్‌ వైద్యుల సలహాలు, సూచనలతో సురేఖకు ప్రసవం చేశారు. సురేఖ ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లితోపాటు శిశువును మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వారు క్షేమంగా ఉన్నారు. సురేఖ కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది 108 అంబులెన్స్‌ సిబ్బందిని అభినందించారు.

రూ.కోట్ల విలువైన భూమి కబ్జా

- జిల్లా కేంద్రంలో బరితెగించిన కబ్జారాయుళ్లు
- ప్రైవేట్‌ భూమితోపాటు ఫారెస్ట్‌ భూమి ఆక్రమణ
- లే అవుట్‌, నాలా కన్వర్షన్‌ లేకుండా గజాల్లో రిజిస్ట్రేషన్‌
- వెనకుండి కథ నడుపుతున్న అధికార పార్టీ నాయకులు
- మౌనంగా ఫారెస్ట్‌ అధికారులు



అసద్‌బాబానగర్‌ కాలనీలోని అటవీ భూమిని సైతం కబ్జా చేస్తున్నారు ఇలా...



ఫారెస్ట్‌ భూమిలో హద్దు రాయి

నిజామాబాద్‌ నాగారం: కోట్లాది రూపాయల విలువైన భూమిపై కన్నేసిన కబ్జాదారులు ప్రైవేట్‌ భూమితోపాటు ఫారెస్ట్‌ భూమినీ వదలడం లేదు. దొంగ రికార్డులు సృష్టించి ఫారెస్ట్‌ హద్దురాళ్లను దాటి మరీ ప్రహరీ నిర్మిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కబ్జాదారుల వెనుక అధికార పార్టీ నాయకులు ఉన్నారని, కబ్జా విషయమై ప్రశ్నిస్తే వారు మౌనం వహిస్తున్నారని బాధితులతోపాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్‌ భూమికి చెందిన వ్యక్తి కబ్జాపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, తమశాఖ భూమిని మాత్రం ఫారెస్ట్‌ అధికారులు పట్టించుకోవడం లేదు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..

నిజామాబాద్‌ నగరంలోని అసద్‌బాబానగర్‌ కాలనీ రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలోని మైనారిటీ గురుకుల పాఠశాల సమీపంలో సర్వేనంబర్‌ 2164లో సుమారు 289 ఎకరాల అటవీశాఖ భూమి ఉంది. చెట్లు, గుట్టలు ఉన్న ప్రాంతాన్ని వదిలేసి 2009లో అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇందులో పేదలకు భూమిని పంపిణీ చేసింది. ఇందులో సయ్యద్‌ ఖమర్‌ భాను అనే మహిళకు ఎకరం భూమి దక్కగా, ఆమెతోపాటు కుటుంబ సభ్యులు వర్షాధారంగా పంటలు సాగు చేస్తూ వచ్చారు. అయితే 2166 సర్వేనంబర్‌లో వేరే వ్యక్తుల వద్ద నుంచి భూమిని కొనుగోలు చేసిన వ్యక్తుల కన్ను 2164లో ఉన్న ఖమర్‌భాను భూమిపై పడింది. ఖమర్‌భాను చనిపోయిన తరువాత 2023లో ఆమెకు చెందిన ఎకరం భూమితోపాటు ఫారెస్ట్‌ భూమిని కొందరు కబ్జా చేశారు. భూమిని తహసీల్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ చేయాల్సి ఉండగా, సబ్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో అది కూడా నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌, నాలా కన్వర్షన్‌ లేకుండానే గజాల్లో రిజిస్ట్రేషన్‌ చేయించుకోవడం గమనార్హం.

అధికార పార్టీ నాయకులే కథ నడిపిస్తున్నారు

తన తల్లికి 2164 సర్వే నంబర్‌లో ఇచ్చిన భూమిని కొందరు కబ్జా చేయగా, అధికార పార్టీ నాయకులు వెనుక ఉండి కథ నడిపిస్తున్నారని సయ్యద్‌ ఖమర్‌ భాను కుమారుడు సయ్యద్‌ నిమిత్‌ ఆరోపిస్తున్నాడు. రూ.7కోట్ల విలువైన భూమి కబ్జా వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు చక్రం తిప్పుతున్నారని, ఇటీవల ఎంఐఎం నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ కార్పొరేటర్‌ సైతం అందినకాడికి దండుకునే పనిలో నిమగ్నమయ్యాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అధికారుల సహకారంతోనేనా..?

ఫారెస్ట్‌ భూమి కబ్జా అవుతున్నా పట్టించుకోని సంబంధిత అధికారులు సర్వేకు వచ్చిన అధికారులతో కలిసి కబ్జాదారులకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కబ్జాదారులకు అనుకూలంగా సర్వే రిపోర్టు ఇచ్చేందుకు పెద్ద ఎత్తు ముడుపులు అందుకున్నారనే విమర్శలున్నాయి. ఇందులో భాగంగానే గుట్టుచప్పుడు కాకుండా పంచనామా సైతం వారికి అనుకూలంగా ఇచ్చేశారని స్థానికులు అంటున్నారు. అటవీ భూమిలోని హద్దురాళ్లను దాటి ప్రహరీ నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా తమ భూమితోపాటు ఫారెస్ట్‌ భూమి కబ్జాపై తాను పోరాటం చేస్తానని సయ్యద్‌ ఖమర్‌ భాను కుమారుడు అంటున్నాడు. ఈ కబ్జా వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన లిఫ్ట్‌ చేయలేదు.

ఆహార పదార్థాలు కలుషితం కావొద్దు

- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



సుద్దపల్లి గురుకులంలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను కలెక్టర్‌ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్‌, డార్మెటరీ, డైనింగ్‌ హాల్‌తోపాటు బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కూరగాయలు సక్రమంగా భద్రపర్చకపోవడాన్ని గమనించిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెస్‌హాల్‌, వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సుద్దులం ఉన్నత పాఠశాలను కలెక్టర్‌ సందర్శించారు. పాఠశాలలో తాగునీటి వసతి, కిచెన్‌ షెడ్‌, టాయిలెట్స్‌, క్రీడా మైదానం తదితర వాటిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌ అధికారులను ఆదేశించారు. పదో తరగతి క్లాస్‌ రూమ్‌కు వెళ్లి విద్యార్థులు గ్రాండ్‌ టెస్ట్‌ పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. నూటికి నూరు శాతం రిజల్ట్‌ సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ ప్రభాకర్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌, స్థానిక అధికారులు న్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(జక్రాన్‌పల్లి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) కలెక్టర్‌ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌ పేషెంట్‌ వార్డు, ల్యాబ్‌, టీకాల గది, డ్రగ్‌ స్టోర్‌ తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, అందుబాటులో లేని వారి గురించి ఆరా తీశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు.

పీజీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్‌ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెయూ క్యాంపస్‌లోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని రిజిస్ట్రార్‌ యాదగిరితో కలిసి వీసీ టి యాదగిరిరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారివెంట ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, కంట్రోలర్‌ ఎం అరుణ, అడిషనల్‌ కంట్రోలర్‌ సాయిలు, వైస్‌ ప్రిన్సిపాల్‌ సత్యనారాయణరెడ్డి ఉన్నారు. తెయూ మెయిన్‌ క్యాంపస్‌, భిక్కనూర్‌ సౌత్‌ క్యాంపస్‌, గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నిజామాబాద్‌), ఆర్మూర్‌, బోధన్‌, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతోపాటు బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎంకే డిగ్రీ కళాశాల సెంటర్‌లలో పీజీ ఒకటో, మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ థియరీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్‌ కోర్సు ఐఎంబీఏ ఏడు, తొమ్మిదో సెమిస్టర్‌ పరీక్షలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 113 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 74 మంది గైర్హాజరైనట్లు అకాడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు.

స్కాట్‌ బెటర్‌ సంస్థలో 70 మందికి ఉద్యోగాలు



నియామకపత్రాలు అందజేస్తున్న టాస్క్‌ సీఈవో శ్రీకాంత్‌ సిన్హా

సుభాష్‌నగర్‌: అమెరికాలోని శాన్‌ ఫ్రాన్సిస్కో కేంద్రంగా కొనసాగుతున్న స్కాట్‌ బెటర్‌ సంస్థ 70 మంది యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. నగరంలోని ఐటీ హబ్‌లో స్కాట్‌ బెటర్‌ తన రెండో శాఖను ఏర్పాటు చేసింది. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న ఏఐ విశిష్టతను తెలియజేస్తూ నైపుణ్య శిక్షణను అందించడంతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని ఎంపిక చేసుకుంది. ఉద్యోగాలు సాధించిన వారికి తెలంగాణ అకాడమీ ఆఫ్‌ స్కిల్స్‌ అండ్‌ నాలెడ్జ్‌ (టాస్క్‌) సీఈవో శ్రీకాంత్‌ సిన్హా శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. నిజామాబాద్‌ వంటి ద్వితీయ శ్రేణి నగరంలో సంస్థను స్థాపించడంతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై కంపెనీ ప్రతినిధులు రక్షిత్‌, రాఘవ్‌ను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో టాస్క్‌ ప్రతినిధులు శ్రీనాథ్‌రెడ్డి, రఘు తేజ, హన్మంత్‌, స్కాట్‌ బెటర్‌ సీనియర్‌ టీం లీడర్‌ ప్రణయ్‌ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో మంచి భవిష్యత్‌..



నిజామాబాద్‌ అర్బన్‌: నైపుణ్యం కనబరిస్తే మంచి భవిష్యత్‌ ఉంటుందని టాస్క్‌ సీఈవో శ్రీకాంత్‌ సిన్హా అన్నారు. టాస్క్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనలోని నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని ఉత్తమ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్‌ ఉంటుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా మెరుగుపడాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్‌: బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందాలనుకునే అర్హులు, ఆసక్తి కలిగిన రైతుల నుంచి సోలార్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌పీడీసీఎల్‌ సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ ఆర్‌ రవీందర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌ రెడ్కో రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలపర్స్‌ (రైతుల భూమి లీజు ఒప్పందం) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక మెగావాట్‌ సౌర విద్యుత్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు 3.5 ఎకరాల నుంచి 4 ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. టీజీ ఎన్‌పీడీసీఎల్‌ తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ నిర్ణయించిన టారిఫ్‌ ప్రకారం విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందన్నారు. బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను ఆదాయ వనరులుగా మార్చుకుని, 25 ఏళ్లపాటు రైతులు నిలకడైన ఆదాయం పొందుతారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఈ కోరారు. మరిన్ని వివరాలకు www.tgredco.telangana.gov.in వెబ్‌ సైట్‌లో లాగిన్‌ కావాలని సూచించారు. దరఖాస్తులకు ఈనెల 22వ తేదీ చివరి రోజని, ఏవైనా సందేహాలు ఉంటే టీజీ రెడ్కో డీజీఎం (63049 03933), జీఎం (90005 50974) నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఈ సూచించారు.

సాయిచరణ్‌ ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి



నిజామాబాద్‌నాగారం: మిషన్‌ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్‌) ఏఈఈ కే సాయిచరణ్‌ ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టి కారణాలను తేల్చాలని తోటి ఉద్యోగులు కోరారు. జస్టిస్‌ ఫర్‌ సాయిచరణ్‌ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని మిషన్‌భగీరథ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిషన్‌ భగీరథలో 2024 నవంబర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సాయిచరణ్‌ మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. ధర్పల్లి మండలంలో సుమారు వెయ్యి వరకు నల్లా కనెక్షన్లకు సంబంధించి కుళాయిలు బిగించేందుకు సరైన బడ్జెట్‌ లేకపోవడం, గ్రామపంచాయతీ సెక్రెటరీ ద్వారా డబ్బుల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవడంతో ఒత్తిడికి గురైన సాయిచరణ్‌ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నిరసనలో మిషన్‌ భగీరథ డీఈఈ మున్యానాయక్‌, ఈఈ రాకేశ్‌, ఇంజనీర్లు రాము, ధనరాజ్‌, ధర్మేందర్‌, దామోదర్‌, శివ, అజయ్‌, బస్వరాజ్‌, గబ్బర్‌ సింగ్‌, సంధ్య, రమాదేవి, కావ్య, ప్రమోద్‌, గంగారాం, అనిల్‌, ఏఈఈలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



ఉత్తమ డ్రైవర్‌లతో డీటీవో ఉమామహేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని జిల్లా రవాణా శాఖాధికారి ఉమామహేశ్వర్‌రావు అన్నారు. రోడ్డు భద్రతామాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రీజియన్‌ కార్యాలయంలో శుక్రవారం ప్రమాద రహిత సర్వీస్‌ రికార్డు ఉన్న డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం జ్యోత్స్న, ఎంఐవీ కిరణ్‌కుమార్‌, డిప్యూటీ ఆర్‌ఎంలు వి శంకర్‌, ఎస్‌ సరస్వతి, పర్సనల్‌ ఆఫీసర్‌ పద్మజ, డిపో మేనేజర్లు బి ఆనంద్‌, ఎస్‌ సాయన్న, శ్రీనివాస్‌, ఆర్‌ సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లు వీరే..

రీజియన్‌ పరిధిలో ప్రమాద రహిత సర్వీస్‌ రికార్డు ఉన్న సీనియర్‌ డ్రైవర్లుగా ఎస్‌.నారయణ(ఆర్మూర్‌), సి.ముత్తెన్న(ఆర్మూర్‌), అబ్బాస్‌అలీ(బాన్సువాడ) గుర్తింపు పొందారు. అలాగే ఆర్మూర్‌ డిపోకు చెందిన వి సుదర్శన్‌, కె నర్సయ్య, బీఎల్‌ రెడ్డి, బాన్సువాడ డిపోకు చెందిన బి బలరాం, పి సుభాష్‌, పీవీ రెడ్డి, బోధన్‌ డిపోకు చెందిన ఎండీ ముఖీం, ఎల్‌పీపీ రెడ్డి, ఎస్‌డీ హైమద్‌, కామారెడ్డి డిపోకు చెందిన ఎం.ఇంతియాజ్‌ అలీ, అబ్దుల్‌ జావీద్‌, ఏఎల్‌ఎన్‌ గౌడ్‌, నిజామాబాద్‌–1 డిపోకు చెందిన బి రాజేందర్‌, ఎస్‌ సాయిలు, వైఎస్‌ నారాయణ, నిజామాబాద్‌–2కు చెందిన టి ముత్తెన్న, పి.సుధాకర్‌, మీర్‌ అన్వర్‌ అలీలు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికయ్యారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో పలువురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసుల్లో న్యాయస్థానం ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15 మందికి నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌లో కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరిచామన్నారు. న్యాయమూర్తి 10 మందికి మొత్తం రూ.125,500 జరిమానా విధించారని, అలాగే ఒకరికి మూడు రోజులు, నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో..

మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు మూడో టౌన్‌ ఎస్సై హరిబాబు తెలిపారు. సదరు వ్యక్తి ఇప్పటి వరకు నాలుగుసార్లు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీల్లో పట్టుబడి జరిమానా చెల్లించాడన్నారు.

చైన్‌ స్నాచర్‌కు 15 నెలలు..

బాన్సువాడ రూరల్‌: పాత బాన్సువాడ రోడ్డులోని బేతాళస్వామి గుడి సమీపంలో 2023 నవంబర్‌ 19న చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన నాగారం నవీన్‌ అనే వ్యక్తికి బాన్సువాడ జూనియర్‌ సివిల్‌ జడ్జి టీఎస్‌పీ భార్గవి 15నెలల జైలుశిక్ష, రూ.100 జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. బీర్కూర్‌ మండలం దామరంచ గ్రామానికి చెందిన ఎర్రోల్ల హన్మావ్వ మెడలోని చైన్‌ను నవీన్‌ తెంపుకొని పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 15 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచినట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

యువతి అదృశ్యం

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్సై రజినీకాంత్‌ శుక్రవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం షాపింగ్‌ కోసం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికారన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్‌ అప్పగింత

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన చల్లా గరిగె రంజిత్‌ ఈ నెల 24న వన్నెల్‌(బి) చౌరస్తా వద్ద తన ఐ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాల్కొండ పోలీసులు సీఈఐఆర్‌ పద్ధతి ద్వారా కనుగొని బాధితుడికి ఫోన్‌ను శుక్రవారం అందజేశారు. హెడ్‌ కానిస్టేబుల్‌ వాసుదేవ్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో చోరీకి యత్నం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌ కూడలి వద్ద ఉన్న ఎస్‌బీఐలో గురువారం అర్ధరాత్రి శ్యామ్‌ అనే వ్యక్తి చోరీకి యత్నించాడు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బ్యాంకులో చోరీ చేసేందుకు వచ్చిన శ్యామ్‌ షట్టర్‌, అద్దాలు పగులగొట్టాడని చోరీ చేయడం సాధ్యం కాకపోవడంతో తిరిగి వెళ్లిపోయాడన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి విచారించగా చోరీకి యత్నించినట్లు ఒప్పుకున్నాడన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్‌: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మండలంలోని సిద్ధాపూర్‌ శివారులో పట్టుకున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో యువకుడి మృతదేహం



సాజన్‌ (ఫైల్‌)

రుద్రూర్‌ : మండలంలోని అక్బర్‌నగర్‌ చెరువులో శుక్రవారం రాత్రి యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మధ్యాహ్నం నుంచి చెరువు కట్టపై బైక్‌ ఉండడంతో స్థానికులు అనుమానంతో పరిశీలించగా చెరువులో మృతదేహం కనిపించింది. గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బైక్‌పై బయటికి వెళ్లిన సాజన్‌ మృతదేహంగా గుర్తించారు. కుటుంబ సభ్యులు గురువారం సాజన్‌ కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం అక్బర్‌నగర్‌ చెరువులో శవమై కనిపించాడు. ఎస్సై సాయన్న ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. సాజన్‌ బట్టలు ఉతికేందుకు వెళ్లి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి సోదరుడు షేక్‌ కబీర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో రక్తపు మరకలు



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రాథమిక పాఠశాల ఆవరణలో రక్తపు మరకలు కనిపించడం కలకలం రేపింది. రోజూలాగే శుక్రవారం పాఠశాల ఆవరణను ఊడ్చేందుకు వెళ్లిన స్వీపర్‌కు తరగతి గది ముందు రక్తం కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల సమీపంలో ఉండే తండ్రీకొడుకులు గురువారం రాత్రి గొడవ పడగా కుమారుడి కాలికి గాయమై రక్తస్రావమైందని నిర్ధారించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

క్రైం కార్నర్‌


బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండలంలోని చింరాజ్‌పల్లికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి శుక్రవారం తెలిపారు. నందిపేట గ్రామానికి చెందిన నాగనాథ్‌ అలియాస్‌ నగేశ్‌ మేస్త్రి తన వద్దకు కూలీ పనికి వచ్చిన బాలికను చేయి పట్టి లాగి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆయనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

యువతి మృతిపై విచారణ

మాక్లూర్‌: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన యువతి మృతిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన శుక్రవారం విచారణ చేపట్టారు. అసలు ఏం జరిగింది? నకిలీ వైద్యుడిని సంప్రదించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని యువతి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. యువతి మృతికి కారణమైన ఆర్‌ఎంపీతోపాటు యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంట స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌ వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, వేణుగోపాల్‌, జేమ్స్‌, ప్రసాద్‌, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ తదితరులు ఉన్నారు.

తల్లికి బాలుడి అప్పగింత



ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి పట్టణంలోని పెట్రోల్‌ బంక్‌ వద్ద తప్పి పోయిన రెండేళ్ల చిన్నారిని పోలీసులు తల్లికి అప్పగించారు. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు పెట్రోల్‌ బంకు వద్ద రోదిస్తూ కనిపించడంతో స్థానికులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సోషల్‌ మీడియాలో బాలుడి ఫొటోను షేర్‌ చేయడంతో తల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. విచారణ అనంతరం పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.